శతరుద్రీయము

"శతధా భావితో రుద్రః
శతధా గదితోఽపివా
మనోజం దేహజం దుఃఖం
సర్వం హరతి శంకరః

రచయిత :

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి

వెల రు. 3-00 లు



రచయిత :

దువ్వూరి సూర్యనారాయణ శాస్త్రి

కాకినాడ

స్వాప్నిక పథము.

"18, 19, శతాబ్దిలో సంస్కృతపండితులు" అనేఒక విమర్శకుడు ప్రచురించినవ్యాసం చదువుకొని ఆతలంపులతో నిద్రపోయేను. రాత్రినాల్గుగంటలవుతుంది. గాఢనిద్రలో ఉన్నాను

విభూతిరేఖాంకిత దేహము, కుంకుమాంకితలలాటము, రోమాంచితశరీరము, రక్తాంబరపరిధానము గల ఒకమహావ్యక్తి బొజ్జ నిమురుకుంటూ దర్శనం ఇచ్చేరు కురుమాపుగడ్డంతో-

"ఇప్పుడే అయింది పంచాయతనార్చన. ఇంకా శత రుద్రీయం తరవాయే"

"కుశలమా? అని పలకరించేరు. నాఒడలు పులకరించింది."

"చిత్తం చిత్తం"

ఒక్కపొడుం పట్టు పీల్చి ఆమహావ్యక్తి నాతో "అందరూ పండితులేనయ్యా. అంతా కవులే. కవి పండితశబ్దాల కర్థం?"

"సెలవియ్యండి తమరే"

"పండా=బ్రహ్మజ్ఞానం, వేత్తి=జానాతీతి పండితః అని"

"మరి కవి అంటేనండి ?"

కవి అంటే పరమేశ్వరుడేనయ్యా! కవిం కవీనాం" కవిం పురాణ మనుశాసితారం" అన్నారుగదా. అనిబొజ్జకదిలీలా నవ్వేఊరుకున్నారు.

అయితే శాస్త్రిగారూ! అలాంటి నిక్కచ్చిసంస్కృత పండితులకు మా తెలుగుకవులంటే చాలా కోపంసుమండీ"

"అబ్బెబ్బే" అది చాలా తెలివితక్కువతనం. వాణీ విలాసా లనంతాలు. ఉన్నది ఒకటే వాణి. ఆగైర్వాణి చిద్రూపాలే ఇవన్నీ. ద్వేషబుద్ధి పతనకారణం ఎంతవారికైనా"

"అయితే ఈకావ్యం కొంచెం వింటారా ?"

"పేరు ?"

"ఇదా శతరుద్రీయం"

"అంటే ?"

"శివునిగురించి వందభావనలు"

"అలాగా పేరు బాగుంది కొత్తగా. ఇప్పుడు నాకున్న తరవాయికూడా అదేగా" అసలు కావ్యం అంటే తెలుసా ?

నవ్యం వపుః శబ్దమయం పురారేః
అర్థాత్మకం దక్షిణ మామనంతి.
అంగం జగన్మంగళ మైశ్వరం తత్
అర్హంతి కావ్యం కథ మల్పపుణ్యాః.

అన్నారయ్యా పెద్దలు. కావ్యం అంటే శబ్దార్థమయంగదా. అర్ధనారీశ్వరమే ఆరెండూను. అట్టికావ్యం రచించడం అల్ప పుణ్యులకు అసాధ్యం. అది జగన్మంగళాధాయిగా ఉండాలి. ఏదీ వినిపించు నాలుగుపద్యాలు.

"వినిపించేను"

"ఇంకొకపొడుంపట్టు ఘాటుగా పీల్చి. అబ్బాయీ! పద్యాలు ధ్వనిప్రధానంగా ఉండడమేకాకుండా పరతత్వాన్నే అన్వేషిస్తున్నాయి. వేదోపనిషత్తులలోని పదభావాలు భావించి రాసేవు. వక్రోక్తులు మరీబాగున్నాయి. సొంతకల్పనములు గూడా అందంగానే వచ్చినాయి. 'శివాయ విష్ణురూపాయ, తత్త్వంప్రకటించేవు. పూర్వమహాకవుల భావనలు జోడించేవు కూడా. మొత్తంమీద సర్వమూశివమే. నామనసు నాకర్షించింది. ఈరకంకావ్యాలు ఇంతవరకూ వచ్చేయుంటావా?

"ఇద్దరం కొంతసేపు మౌనం"

"శాస్త్రీ! ఈకావ్యం........"

"చిత్తం సెలవివ్వండి"

హరిహరనాథుడు తిక్కనకే కలలో కనిపించి అతనిరచన భారతం తనకు కృతిగా ఇమ్మన్నాట్టగదా. నిజమేనా?

"చిత్తం. గ్రంథంలో అలాగే వ్రాసుగున్నారండి"

"సరే తథాపి భక్తి స్తరుణేందు శేఖరే"లో వాణ్ణి నేను. ఈకావ్యం మాస్మారకంగా భూలోకంలో నిలిస్తే మేము స్వర్గంలో చిరకాలం తిష్ఠ వేయగలం. శబ్దం నిత్యం గదా. ఏమంటావు ?"

"అంతఅదృష్టం నాకావ్యానికి కలిగితే కావలసిందేమిగురూ!"

కృతిలేక రాజు లెక్కడ
కృతి కూర్పక కవియునేడ? కృతకృత్యతకున్
గతు లీకృతులే చిరసు
స్థితికిన్, కృతు లేలికలు ప్రసిద్ధి వహింపన్.

అని అన్నారుగదా! అంతేకాదు. విద్వదగ్రేసరుడు, మహోపాసకుడు, అయుతశిష్యగురుడు, ఆత్మారాముడు నాకు అల్లుడన్నమాట. దీనితో కందుకూరివారి సువిశాలపండితవంశీయు లంతా మాకు ఆత్మబంధువులు కాగలరు. తమలాంటిమహాత్ములు మాకావ్యకన్యపై కన్నువేసేరంటే దానిబ్రతుకు పండిందన్నమాటేగదా! అది పుట్టినజాతకం మంచిది.

"ఔనులే- నాకోరికలో తీర్థం స్వార్థం కూడా ఉందిలే"

"అయితే నేను తమతో తూగగలనా సామీ! ఇచ్చిపుచ్చుగోవడాలమాట ?"

"దాని కేముందోయ్. నీమధురకంఠంతో రాగయుక్తంగా నాలుగు పద్యాంతాలు- ఆశువుగా- అంతే. అను"

V

(కలలో వెఱ్ఱికేకలు)

"ఏమండీ! ఏమండీ! పలవరిస్తున్నారు. ఏమిటా వెఱ్ఱి కేకలు? లేవండి. లేవండి. నమశ్శివాయ అనుకోండి"

"మెలకువ వచ్చేసింది"

కందుకూరిగురువులు కలలోకి వచ్చేరే లక్ష్మీనరసింహశాస్త్రి గారు. "శతరుద్రీయం తరువాయి" అన్నారు. నాకావ్యాన్ని కృతికోరేరు. అతిమధురంగా వారిని భావించి పద్యాంతాలు గొంతెత్తి రసవత్తరంగా అంటోంటే రసకందాయం అంతా చెడగొట్టేవే. లేపేశేవు. ఆస్వప్నమాధుర్యం రసాభాస చేసేసేవు.

"ఇప్పుడైతే ఏంమునిగిపోయింది? ఉషఃకాలం అవుతోంది. మీకలవాటేగదా! లేచి ఆపద్యా లేవో భావించుగోని కాయితంమీద పెట్టండి. ఎల్లుండి ఆయన వర్ధంతి వస్తోంది.

"జానేవ్! మంచిసలహా. అలాచేస్తాను"

దువ్వూరి సూర్యనారాయణశాస్త్రి.

శతరుద్రీయ కృతిసమర్పణ.

శ్రీవిద్యోపాసకునకు
పావనకులపతికి తత్త్వభావనమతికిన్
ఆవిష్కృతసకలపురా
ణావగతార్థునకు బుధజనస్తుతమతికిన్. 1

వ్యాకరణకేసరికి వి
ద్యాకైరవకౌముదికి సదాజపనిష్ఠా
శ్రీకామున కభ్యుదయ
శ్రీకల్యాణునకు కీర్తిశేషబుధునకున్. 2

కుంకుమలలాటునకు శై
వాంకితసర్వాంగభసితభాసురునకు క్షే
మంకరునకు శిష్యసహ
స్రాంకునకు నృసింహశాస్త్రియన్ విబుధునకున్. 3

పుత్రసుపౌత్రప్రపౌత్ర
భ్రాత్రాదిమహాకుటుంబభారునకు ఇహా
ముత్రల ధన్యత కాంచిన
సుత్రామసమాన భోగసుఖమయుజనికిన్. 4

ప్రవచనపటుధీయుతునకు
అవగతవేదాంతవేద్యహరిహరునకు దు
ర్భవభవమాయాకర్తన
పవిమూర్తికి నారసింహభవ్యగురునకున్. 5

జ్యోతిశ్శాస్త్రబుధాగ్రణి
కాతతవిద్యాకళాహయగ్రీవునకున్
ప్రాతర్వంద్యున కీకృతి
చేతఃప్రీతిగ నొసంగి చేయుదు నతులన్. 6

శ్రుతిబోధలు, శ్రుతిశిరసుల
నుతులు, మహాకవుల భక్త్యనూనస్తుతులున్
శితికంఠుని భావించిన
గతులే యీకృతి గ్రహించి కరుణింపవయా. 7

కృతిగ్రహీత :

కీ॥ శే॥ కందుకూరి లక్ష్మీనరసింహశాస్త్రిగారు

(1903 – 1978)

వారి ధర్మపత్ని

కీ॥ శే॥ లక్ష్మీ నరసమ్మ గారు

(1907 – 1977)

ప్రముఖ సంస్కృత వ్యాకరణ పండితులు, పౌరాణిక శేఖరులు,
శ్రీ విద్యోపాసకులు, కులపతి, వేదాంతోపన్యాసకులు,
వైద్య జ్యోతిశ్శాస్త్ర విశారదులు

బ్ర॥ శ్రీ॥ కందుకూరి లక్ష్మీనరసింహశాస్త్రిగారి

జీవిత సంగ్రహము

రచయిత :

'భాషాప్రవీణ' శ్రీ కందుకూరి భాస్కరశాస్త్రి - మోడేకుఱ్ఱు

శ్లో॥ లక్ష్మీపూర్వనృసింహాఖ్యో। లక్ష్మీనృసింహశాస్త్రిణే
దద్యాత్ కామ్యప్రదోముక్తిం, కామశైలాగ్రసంస్థితః॥

జననము :

చతుర్ముఖు డాదిగా బయల్వెడలిన సృష్టిలో బ్రహ్మణ్య వరేణ్యులయిన మహర్షులతో గొన్ని విప్రగోత్రములు వెలసినవి. వానిలో "భార్గవ, చ్యావన, ఆప్నవాన, ఔర్వ, జామదగ్న్య" పంచార్షేయప్రవరాన్వితమయిన "శ్రీవత్సస" గోత్రముత్తమమైనదని తద్‌జ్ఞులు వాక్రుత్తురు. అట్టి యుత్తమ గోత్రమున శ్రీ కందుకూరివారు తపస్సంపన్నులు, సత్యశీలులు, జితేంద్రియులు నయి నేటి పశ్చిమగోదావరిజిల్లా 'మునిపల్లె' గ్రామమున నెలకొనియుండిరి. ద్వాదశీవ్రతవల్లభులని పేరొందిన శ్రీ యజ్ఞేశ్వరశాస్త్రిగారు నరసింహశాస్త్రిగారి పితామహులు. వ్యాకరణాచార్య బిరుదాంకితులు, కాశీ పండిత ప్రకాండులు తపస్సంపన్న శ్రీ కృష్ణశాస్త్రి అప్ప సోదెమాంబా

పుణ్యదంపతుల గర్భశుక్తిముక్తాఫలాయమానులై లక్ష్మీనర సింహశాస్త్రిగారు 1903వ సం॥ మాఘ శుద్ధ పూర్ణిమనాడు జన్మించిరి. వీరికి భాస్కరశాస్త్రి యను యనుజుండు. అన్న పూర్ణ యను అక్కయు గౌరమాంబ యను చెల్లెలును గలరు.

విద్యాభ్యాసము:

వీరి బాల్యమున తండ్రిగారగు కృష్ణశాస్త్రిగారు శ్రీ చల్లపల్లివారి వేదసంస్కృతపాఠశాలలో నాచార్యకము వహించి మోడేకుఱ్ఱు వచ్చి స్థిరపడిరి. వీరు తమ తండ్రిగారి యొద్దనే కావ్యనాటకాలంకార సాహిత్యగ్రంథములను కూలంకషముగ జదివి వ్యాకరణశాస్త్రము నాభాష్యాంతము చదివి పలువురువిద్యార్థులకు బహువిధముల నామ్నాయముఁ జేయుచు 1935 సం॥న శ్రీ పీఠికాపురసంస్థానమున వ్యాకరణశాస్త్రి పరీక్షలో నుత్తీర్ణులయి ఘనపారితోషికము నొందిరి.

న్యాయశాస్త్రము:

ఆ పాఠశాలలోనే "చతుస్తంత్రి" "కులపతులగు" బ్ర॥ శ్రీ॥ కొల్లూరి సోమశేఖరశాస్త్రిగారివద్ద న్యాయశాస్త్ర మభ్యసించిరి.

వేదాంతము:

చిఱుతదనంబున, చిఱుతపూడి గ్రామ వాస్తవ్యులు సువర్ణకుండలఘంటాకంకణాన్వితులు "న్యాయవేదాంతవిద్యాపారీణ" "పౌరాణికశిరోమణి" ఇత్యాదిబిరుదాంకితులయిన బ్రహ్మశ్రీ కడియాలసీతారామశాస్త్రిగారిదగ్గఱ వేదాంతశాస్త్రాభ్యాసము చేసి విలక్షణానుభూతిసందిన మహానుభావులు వీరు. మాండూ

క్యము బృహదారణ్యకాది వేదాంతగ్రంథము లనేకము లభ్య
సించి బ్రహ్మానుభూతిచే నాత్మానందసాక్షాత్కారము నందిరి.
ప్రస్థానత్రయము నభ్యసించి భాష్యశాంతి చేసిరి.

శ్రీ వి ద్య :

సాంగవేదాధ్యాయులై 'సర్వతంత్రస్వతంత్ర' బిరుదాం
చితులయిన బ్రహ్మశ్రీ నముడూరి కామేశ్వరిశాస్త్రిగారి యను
గ్రహపాత్రులై తత్ప్రసాదాసాదిత చండీనవాక్షరీ దుర్గామహా
మంత్రోపాసనముపొంది నాటినుండియు సుమారు 36 సం॥లు
భీమవరము తాలూకా యుండగండి గ్రామమున నవరాత్ర
దీక్షనొంది శ్రీజగదంబను లక్ష కుంకుమ, లక్ష బిల్వ, లక్ష
తులసి, లక్ష కమలములతో నర్చనలను చేల్చి సప్తశతీపారా
యణము చేయుచు నమ్మవారి సందర్శనభాగ్యము నొందిన పవిత్ర
జీవనులు వీరు. వీరిమహిమకు ముగ్ధులయిన ధార్మిక సుక్షత్రియ
బృందములచే భూరి సన్మానము లంది ధన్యతనొందిరి.

జ్యో తి ష ము :

జ్యోతిశ్శాస్త్రము తమ తండ్రిగారివద్దనే కూలంకషముగ
నభ్యసించి భూత, భవిష్యద్వర్తమానములను పలువురకు
చెప్పుచు ముహూర్తనిర్ణయములో దైవజ్ఞులుగ పేర్కొనబడిరి.

వై ద్య ము :

ఆయుర్వేదమునందు మంచి జ్ఞానముగలిగి యనేకుల
కుచితముగా వైద్యసలహానిచ్చి యథోచిత వైద్యము చేయు
చుండెడివారు.

పురాణ ప్రవచనము :

మోడేకుల్లున సుప్రసిద్ధ వేదాంతులు, వైద్యులునయిన శ్రీ నిమిషకవి శ్రీరామమూర్తిగారియింట యోగవాసిష్ఠము, భగవద్గీతాది వేదాంతగ్రంథసారమును తమయనుభవముతో మేళవించి పురాణప్రవచనము చేయుచు జనులను తన్మయులను చేయుచుండెడివారు. వీరు శివపురాణమును మైమరచి చెప్పచుండగ శివుడు ప్రత్యక్షమయిన ట్లనుభూతిని నెందఱో పొందిరి. శివతత్త్వనిరూపణము చేయుటయందును, పార్వతీ పరిణయసందర్భమునను వీరి తన్మయత యనన్యాదృశము. మహాదేవపట్టణము, భీమవరము, గుణుపూడి, ఆత్మకూరు, ముక్కామల, పుల్లేటికుఱ్ఱు, కొత్తగూడెము, యండగండి, కాకినాడ మొదలగు అనేక స్థలములలో దేవీభాగవతము, బ్రహ్మాండ, బ్రహ్మవైవర్త, నారద, స్కాందాది అష్టాదశ పురాణములను, వాసుదేవమననము, సీతారామాంజనేయము మున్నగు వేదాంతగ్రంథములను తద్రహస్యములను బోధించి పరమగురువులై పౌరాణికోత్తములై రాణించిరి.

మంత్రోపదేశము :

పంచాక్షరీ పరబ్రహ్మముచే పుణ్యపురుషుడుగాఁ గొనియాడబడిన ధన్యాత్ములు శ్రీ శాస్త్రిగారు. ఓవర్‌శీలు ఉద్యోగిగనున్న జోస్యుల రామకృష్ణయ్య దంపతులు ఈశ్వర ప్రేరణము శాస్త్రిగారిదగ్గఱశిష్యరికము నొంది మంత్రోపదేశము నందిరి. శ్రీ దివాకర్ల నరసింహము అన్నపూర్ణమ్మ మొ॥ అనేకులకు గారి పంచాక్షరి, శివపంచాక్షరి, దుర్గ మొ॥ మహామం

త్రముల నుపదేశించిరి వీరిదగ్గఱ మంత్రములందినవారు సహస్రాధికముగనుండిరి, వీరు కులపతులయిరి.

వ్రతాచరణము:

వీరు కృష్ణాష్టమీవ్రతము నాచరించుచు బృందావనమున కమలములతో రాధాకృష్ణుల నర్చించు తీరు సర్వులను ముగ్ధులను చేయుచుండెడిది. శారదా నవరాత్రములు ధనుర్మాసదీక్ష, ఏకాదశీవ్రతము మొదలయినవాని నాచరించుచు పరులకు నవతారపురుషులవలె భాసించుచుండెడివారు. వీరి యుపదేశములను శ్రద్ధగా నాలకించిన నాస్తికులెందఱో తాము త్యజించిన సంధ్యావందన పైతృకాదులను తిరిగి యవలంబించి ఆస్తికశిఖామణులయిరి.

సాంసారికజీవనము:

వీరు తమ పదునాఱవయేట శ్రీ కొంపెల్ల వెంకట చెన్నుగారి పుత్రికారత్నము లక్ష్మీనరసమాంబను పాణిగ్రహణ మాచరించినది మొదలు ఉత్తమాదర్శము చాటుచు సాంసారిక యాత్ర సాగించిరి. వీరు సంసారమునందున్నను జనకాదులవలె నిర్ధూతకల్మషులై సంతతము బ్రహ్మవాదులై తామరాకున నీటి వలెనేయుండిరి. లక్ష్మీనరసింహశాస్త్రి, శ్రీకృష్ణమూర్తి, శ్రీ రామచంద్రమూర్తి, చిన రామచంద్రమూర్తి, సూర్యప్రసాద రావు అను నయిదుగురు కుమారులను బడసిరి. కుమారులందఱును పండితులు, కవులు, విమర్శకులునయి ప్రసిద్ధినందిరి. అప్పసోదెమ, లక్ష్మీనరసమ్మ, సోదెమ్మ, రాధారత్నము, కనకదుర్గాంబయను నయిదుగురు కుమార్తెలను పడసిరి. వీరి పుత్రులకును పుత్రికలకును కుమారులు, కుమార్తెలు, మనుమలు

గలరు, ఈ రీతిగా వీరి సంతానము బహు సంతానములతో విరాజిల్లుచుండెను.

సాంఘిక జీవనము:

ఉత్తమ పౌరిలుగ, నిరంతర దానధర్మాది క్రియారతులుగ, అజాతశత్రువులుగ, నుత్తమ పుత్రులుగ, నుత్తమ సోదరులుగ, ఉత్తమ జాతకులుగ, నుత్తమోత్తమ పితామహులుగ వీరు ఆదర్శజీవనము నడిపిరి. "యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరోజనః" అన్నట్లు పలువురకు మార్గదర్శకులయి లక్ష్మీనరసింహశాస్త్రిగారు రాణించిరి.

నిర్యాణము:

'వార్ధకే మునివృత్తీనా'మ నునట్లు వార్ధక్యమున ఆత్మానుసంధానము చేసికొనుచు నజగరవృత్తిలో భార్యావియోగానంతరము 14 మాసములుండి 'కాశ్యాంతుమరణాన్ముక్తిః అథవా పుత్రసన్నిధౌ" అన్నట్లు తమ పుత్రుల సన్నిధిని "అతిసారేణ మరణందుర్లభం యోగినామపి" అన్నట్లు అతిసారవిరేచనములచే "మాసానాం మార్గశీర్షో ఽహం" అన్న రీతిని పవిత్ర మార్గశిర మాసమున బహుళవిదియా స్థిరవాసరమున సా. గం. 4-40 ని.లకు 1978 (డిశంబరు 16) ధనుస్సంక్రమణ పుణ్యకాలమున పునరావృత్తిరహితపుణ్యలోకమున శ్రీదుర్గాకైవల్యమునందిరి

ఇట్లు పుణ్యాత్ములు, ధన్యులు, మహాత్ములు, అవతార పురుషులున్న కీర్తికి నిధానమయిన వీరిచరితము విన్నను చదివినను పునీతులగుదు రనుటయందు సందేహము లేదు.

ఇది శ్రీః.

శతరుద్రీయము

శ్రీమండై వరభక్తకోటికి జగజ్జీవాత్ముఁడై, వేదమ
ర్యాదన్ ధిక్కృతిసేయుకంటకులకెల్లన్ గుండెలో గాలమై
భీముండై యధికారవిత్తబల దోర్వీర్యాతి మూర్ఖాలికిన్
నాదబ్రహ్మమయుండు శంకరుఁడు సంతాపార్తు నన్నోముతన్.

చూడన్ లేఁడు, వినంగఁబోఁడు పరమేశుం డొక్కఁ డెందేని యు
న్నాఁడా లేఁడ? యటంచు సందియముతో నాశంబు కాఁబోక, యు
న్నాఁ డంచుం గృషిసల్పుచుండుటయె "పంథా" "నేహానానాస్తి"యుం
చాటెం బాడెనుగాదె వేదములు శర్వా! నానమోవాకముల్. 1

ప్రళయోద్భిన్న నటత్తృతీయనయన ప్రాదుర్భవద్భీకర
జ్వాలనప్రోద్ధ కణప్రదగ్ధ సకలబ్రహ్మాండహవ్యా! విని
ర్మలశుభ్రాంశుకళాకిరీట! హర! శర్వా! మేరుకోదండ మం
డల! బీభత్సుజయైకహేతుశరదండా! మన్నమోవాకముల్.

ఆడె నఘోరుఁ డంచు శ్రుతి, ఆపయి నీకలరూ పెఱుంగుటన్
గాఁడఁగ ఘోరు ఘోరతరుగా నిను నెన్నను, కానినాఁడు నా
గోఁడు తొలంచకుండు టతిఘోరముగాదె, యుపేక్ష చేసినన్
ద్రాడును బొంగరంబు గలదా మఱి నాకిఁక ఆదిభిక్షువా! 2

---

1 అసీదవాతం స్వధయా తదేకం తస్మాద్ధాన్య న్నపరః కించ నాస.
"ఏకం సద్విప్రా బహుధా వదంతి" (ఋగ్వేదం)
"నచక్షుషా పశ్యతి కశ్చ నైనం "న సందృశే తిష్ఠతిరూపమస్య —

2 "అఘోరేభ్యో థ ఘోరేభ్యో ఘోర ఘోరతరేభ్యః"

శివముం గోరెద వెల్లజంతువులకున్, జేకూర్తు భక్తాలికిన్
శివమున్, నామము చే శివుండవుగదా చిద్రూప! సర్వాత్మతన్
శివముం గోరెడిజంతు వెన్నటికి నేనిన్ నిన్నుదక్కన్యునిన్
చవికైనం దలఁపోయునే? శివతరా! శంగా! నమస్కారముల్. 1

కలవు సహస్రశీర్షములు కాళులు కన్నులు వేనవేలు భూ
వలయము నిండి పూరుషుఁడవౌచు దశాంగులమూర్తి మించిపై
నిలిచితి వంచు నాడె శ్రుతి నేర్పఁగ, నామొఱ లాలకింపఁగా
వలయుశ్రుతిప్రసంగమును బాపురె! యాశ్రుతియున్ వచించెనే? 2

నీరును గాలి యాకసము నిప్పును యాజియు సూర్యచంద్రులున్
ధారుణి త్వత్స్వరూపపరతత్త్వములే యని శాస్త్ర మెన్నుటన్
పేరున కష్టమూర్తి యని పేర్కొని రిట్టివిశాలరూప, మే
తీరున ధ్యానలగ్నమగు? దివ్యభవత్కృప లేక శంకరా! 3

వికటభ్రూకుటి భీషణంబును సముద్వేగావహంబున్ సుఘో
రకరాలం బయినన్ శ్రుతిం దగ నఘోరాభిఖ్యఁ జెన్నొందె, తా
నకలంకమ్ము, భవార్తినాశకము, ముఖ్యప్రాప్య మైయున్నతా
వక తద్దక్షిణవక్త్రమే గతిగ సంభావింతు సర్వేశ్వరా! 4

---

1 "నమ శ్శివాయచ శివతరాయచ"

2 "సహస్రశీర్షా పురుష స్సహస్రాక్ష స్సహస్రపాత్.
సభూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠ ద్దశాంగులం."

3 పృథివీ సలిలం తేజో వాయు రాకాశమేవచ,
"సూర్యా చంద్రమసౌ సోమయాజీ చేత్యష్టమూర్తయః"

4 "తద్దక్షిణం పశుపతేః పరమం పదంమే
సాంసారికార్తిహరణం శరణం ప్రపద్యే"

విమల మణుస్వరూప మతివిస్తృత సర్వజగత్స్వరూపమున్
క్రమత దశావతార పరికల్పిత చిత్రవిచిత్ర రూపముల్
అమరుచు నుండ నీకు, నిఁక నద్వయ భావన మెట్లు మాకగున్?
భ్రమ తొలగించి సామి!, భవబంధము త్రెంపఁగదే శివంకరా! 1

కరములు చాఁచి యార్చుటలు కమ్రచలత్సితపక్షపాళిగా
తిరుగుడులందు గంగసుడితీరులు వజ్రపుఁబంజరంబుగా
సరసపుటంగభంగిమలు సల్పెడి నీ వొక రాజహంసగా
దరహసిత త్వదీయశివతాండవమూర్తి యనుగ్రహించుతన్.

మౌళి సుధాంశురేఖ లసమాన కళామయ పూర్ణబింబమై
గ్రాలఁగ, నిప్పుక న్నొకయలాతపుఁజక్రముగా విరాజిలన్
పాలితగంగ, నీటిసుడిభాతి కనంబడఁ దాండవభ్రమిన్;
కేలి యొనర్చు శంకరుఁ, డకించను నన్ను ననుగ్రహించుతన్.

నిరవయవాద్భుతప్రకృతి నీదట, ముమ్మొనవాలుదాల్పగా
కఱఁచెడి యగ్గికంటి దొరగాఁగ, పినాకిగ, మారహంతగా
గిరిసుతసత్కళత్రముగఁ గేరుదువే, యిటు లయ్యెనే భవ
న్నిరవయవత్వనిర్గుణత నేర సమన్వయ మోపరాత్పరా! 2

పదములు భక్తలోకపరిపాలనభారము మోయుఁ, గుక్షియున్
ముదమున సర్వలోకభరమున్ ధరియించును, నీదుశీర్షమున్
పదపడి చంద్రుఁ, గంగను, కపాలికమాలను మోయు, నీయొడల్
ముదితను బాములన్ విడక మోవగ, న న్వహియింప భారమా?

---

1 "అజాయమానో బహుధా విజాయతే"

2 ''సగుణాత్మకం పరబ్రహ్మ సావయవం సనామరూపం''

ధ్యాననిమగ్నమై యొకటి, తత్పరతన్ గిరిజాముఖస్తన
ధ్యానమునందు వేఱొకటి, తన్నలయింపఁగఁ బొంచియున్న యా
మానసజన్ముపై నొకటి, మాటి, విభిన్నరసప్రవేశమున్
పూనినయాత్రిలోచనుఁ డనూనకృపామతి నన్ను బ్రోచుతన్.

ఈవు సదాశివుండవు, వరించినవాఁడవు సర్వమంగళన్
కావున నే శ్మశానమది కాకులు, గ్రద్దలు, కర్పటంబులున్
ప్రేవులు, ప్రేత, లెమ్ములును, పీన్గులు, కేశము, లిన్నియుండియున్
పావనమై భవన్నివసనంబునఁ బేర్గనె రుద్రభూమియై.

తానొక భిక్షుకుం డయినఁ దప్పక లోకుల కోర్కు లిచ్చుచున్
తాను శ్మశానవాసియయినన్ సుపవిత్రతయే యొసంగుచున్
తాను పిశాచనాథుఁ డయినన్ అభయంబె జనాలి కిచ్చు నీ
శానుచరిత్రచిత్రము, విశాలముఁ, దాదృశమూర్తిఁ గొల్చెదన్. 1

నరులకుఁ బుట్టుకోరిక లనంతము, లయ్యవి పూర్తిసేయ నీ
కిరణ మొకొక్కడే నిలిచి కేవల దైవతమూర్తి యాచుఁ ద
ద్వరములఁ దీర్పఁ బట్టి, బహుదైవతవాదము వచ్చెఁ గాని, యి
ద్ధరను విరాట్ స్వరూపపరధామము నీవెగదా పరేశ్వరా!

ఆదిత్యుని బింబమందున హిరణ్యశ్మశ్రుకేశుండవై
ధ్యేయబ్రహ్మగఁ బూరుషాకృతిగ భూతేశా ప్రవర్తిల్లుచున్
గాయత్రీ పరమంత్రయుక్తిని త్రిసంధ్యన్ మ్రొక్కు భక్తాళినిన్
నీయందుంచుచు నుద్ధరించెదఁట' వందే, దేవ! సర్వేశ్వరా! 2

1 "నసంతి యాదార్థ్యవిదః పినాకినః।

2 హిరణ్యశ్మశ్రుకేశ మాదిత్యగతం దివ్యపురుషం ధ్యాయేత్"

అమరిచిరయ్య బ్రహ్మమును లాత్మసమాధులలోన, తారత
మ్యములనుబట్టి, గోచరము లైనవిధమ్ముల, వేదతత్త్వ శా
స్త్రముల, నగాధవేదశిఖలన్ నిను; వారల పూర్ణసిద్ధు లా
క్రమమున నుండె; నయ్యవి యగమ్యము, లాస్థితి లేమి శంకరా!

అఖిలోగ్రవిషమ్ము జగదత్యాక్రాంతి నుప్పొంగఁగా
శోభాశూన్యత సర్వదేవతలు భ్రష్టుల్ గాఁగఁ, గ్రవ్యాదు లా
శాభావంబుల వీడి త్రెళ్లఁగ, జగజ్జాలంబు లల్లాడఁగా,
"మాభైష్టేతి" విషమ్ము మ్రింగిన జగన్మాన్యుండు నన్నోముతన్.

కైలాసాద్రి చలింపఁగా, ప్రమధు లుగ్రప్రక్రియన్ కేరఁగా,
ఆ లంబోదరుఁ డమ్మగారియొడి నత్యంతార్తితోఁ జేరఁగా,
శైలాదుండు కలంగఁగా, విషధరస్వామి ప్రకోపింపఁగా,
కాల న్నొక్కి దశాస్యు మట్టిన జగత్కల్యాణు భావించెదన్.

జడలన్ గంగమ, నిప్పుకన్ను, పదిహస్తంబుల్, విభూత్యంగమున్
మెడపై నల్లనిమచ్చ, తోల్వలువ, వన్నెల్ పాపభూషల్, కడున్
బడుగెద్దొకటి, మోము లైదు, కనులన్నమ్మాఁడు, స్త్ర్యర్ధాంగ, మీ
వడువో నద్భుతతావకాకృతి జగద్వంద్యంబు సర్వేశ్వరా!

పాయక పంచభూతము లభంగురతన్ భవదాజ్ఞలన్ సదా
చేయుచు, ధర్మహీనత వసించెడిచోటుల సర్వనాశముం
జేయుచు నుండు, నట్టులె శచీపతి ముఖ్యవిరించికేశవుల్
ధ్యేయము నీవె యంచు గురుతించి త్వదిచ్ఛకుఁగింకరుల్ శివా! 1

---

1 "త్వదుచ్ఛ్వసితేనైవ భ్రమతి జగచ్చక్రమ్"

తారానాయక శేఖరుండు, జగదాధారుండు, ధారాధర
శ్రీరమ్యోత్తమ కంధరుండు, గిరిజాశృంగారుఁ, డుద్వేల భీ
భారాక్రాంత మహాప్రచండగరల ప్రారంభ సంబాధ, చ
ల్లారం జేసినయాదిశంకరు మహోల్లాసంబు నన్నోముతన్.

క్రతువులుఁ దత్ఫలమ్ము క్రతుకర్మము మర్మము నీవెయుంచుఁదా
మతి నెఱుఁగండు, పిల్వకవమాన మొనర్చెను నిన్ను దక్షుఁడా
ప్రతిఫల మందకుండునె; భవత్క్రుధ భీకరవీరభద్రరూ
పత రవణిల్లి తత్క్రతువు ధ్వంస మొనర్పదె ధూర్జటీజటీ! 1

సేవ్యుఁడు సేవకుం డనెడి చింతన ద్వైతము, ద్వైతవృత్తి చే
భావ్యము భీతి, భీజడుఁ డభాగ్యుఁ డగుంగద, యేకభావనన్
సేవ్యుఁడవంట, నాబుజము నే నెటులెక్కఁగలాడఁ? దోఁచదో
యవ్యయ! జ్ఞాన మందువఱ కద్వయభావన లేదు శంకరా! 2

వేదములే యుపఘ్నముగ, వేదశిఖల్ పరమార్థ వృష్టిగాఁ
బాదుకొనెన్ కరప్రముఖవల్లులు-అయ్యవి వేమొగంబులై
మేదురవాసనల్ జగతి మించగఁ దత్ప్రసుమంబు నిన్గనెన్
గాదె జగన్నివాస! భవి గాంచఁగ నెట్లగు నిన్ను శంకరా?

వాగర్థంబులరీతి నుంటిరట, గర్భం బామె యెట్లీడ్చెనో
సాగెంబో ప్రసవం బెటుల్? పురిటిజంజాటం బెటుల్ తీఱెనో
రాగప్రక్రియ లెట్టివో? తలఁపఁగా రాదంగమం దర్ధమా
భాగం బిమ్ముటయున్న నెట్టులదుకున్, భావింప సర్వేశ్వరా?

1 "యజ్ఞో వై విష్ణుః"   2 "ద్వితీయాద్వై భయం భవతి"

ప్రాపై యున్నదె నీకు సంసృతిభవప్రారబ్ధ? మాపైని భా
ర్యా పుత్త్రాదులు, కొంపగోడులు, నసాధ్యంబౌ తపోనిష్ఠలున్
గోపాటోపము, లేల వీని దడవన్, లోకేశ! సంసారపుం
దీపుల్ తీఱఁగఁ జూడు నన్ సగుణమూర్తీ! పాహిమాం! శంకరా!
ఆశాపాశము మోహపాశమును మాయాపాశముం జుట్టి స
ర్వేశా! పర్వులు పెట్టఁ జేసెదవు నీవే మమ్ము, లోకమ్మునన్
పాశోద్బద్ధుఁడు పర్వులెత్తగలఁడే? వైచిత్రి యేమున్న స
ర్వాశల్ ద్రిప్పెదు పాశబద్ధుని జగద్వంద్యా! నమోవాకముల్.
మాట మనస్సుతోఁ బయనమై నిను గానఁగలేక, రెండునున్
గూటికిఁ జేరుకొన్నవఁట, గొప్పఁగ వాక్కుల నెందుకో స్తుతుల్?
గాటముగా మనంబునఁ దలంచుట యెట్టులొ యింక? వేదమే
బూటకమాడెనో, యునికి బూటకమో? హర! తోఁచదేమియున్. 1
ఆపదలందె నీదగుసహాయము గోరు నరుండు, సంపదన్
నీపయి నిల్పఁడే మనసు, నిక్కము బాధలు నీవె కూర్చితం
చేపున నిందసల్పు, నటులే సుఖముల్ గణియింప నేరఁడీ
పాపపుకోపతాపములఁ బాపి నిరంతరభక్తి నీ గదే! 2
అంగన కర్ధదేహ మిడు, టంగదకై గరలమ్ము తింట, స
ర్వాంగము వట్టి దిస్సమొల యాటయు, వృత్తిగ మారణక్రియా
సంగతి కొంట, పార్ధుని ప్రచండప్రహారములందుఁ, టయ్యరే
వెంగలి వంచు నిన్ను పదివేలమొగంబులఁ జాటి చెప్ప రే?

1 "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ"
2 "పకో దదాతీతి కుబుద్ధి రేషా"

హరిచక్రాంకము నీవు నీదగు త్రిశూలాంకమ్ము నారాయణుం
డురుభక్తిన్ ధరియింపలేదె? హరి యెంతో ప్రేమ నర్ధాంగియై
పురసంహారశరంబునై తమకు నింపుల్ గూర్చె సంతానభి
క్ష రహిన్ శ్రీపతి కిచ్చినాఁడవు పరేశా? మీ రభిన్నుల్గదా. 1

కౌఁగిట రెండు, కోప మరిగట్టుచు మోము తెమల్ప నొండు రెం,
డాగిలిగింత రెం, డధర మానఁగ రెం, డలకాలి దిద్ద రెం,
డీగతి దుర్గయందు సఫలేచ్ఛ వహించు సమస్త హస్తముల్
సాగెడి శంభుమూర్తి సుఖసంపద నిచ్చి యనుగ్రహించుతన్.

తలపై నే మది? నీరు; మోము గలదే, తన్వంగి? యంభోజ; మా
యలకల్? తుమ్మెద; లాబొమల్? తరఁగ; లాయక్షుల్? సరే, బేడిసల్,
వలుద ల్దద్రుతుచమ్ముల్? రథాంగములు కావా? ఏల సందేహ మో
లలనా? యంచును చండికన్ మొఱగు శర్వస్వామి నన్ బ్రోచుతన్.

అంగము లాకృతుల్ గుణము లాభరణమ్ములు లేవు నీకు, ని
స్సంగ, మనాద్యనంత మని, చాటఁగనో నిను, లింగరూపతన్
మంగళమూర్తి వౌట భువి, మానవు లిద్ది గ్రహింపలేక నీ
సంగతి, యంగపూజలను సల్పుదు రెంతభ్రమంబొ శంకరా?

బీజము రుండమాల, అతివిస్తృతశీర్ష జటాకలాపమే
రాజిలు కేసరమ్ములు, మరందమె జాహ్నవి, రేకులే కనుల్
భ్రాజిత కంఠకాళిమమె పంకము, దాన జనించు నీదు నీ
రేజసుఖాసనమ్మె నను రేపులు మాపులు నోము శంకరా!

---

1 "త్వమేవాహం జనార్దన, ఆవయో రంతరం నాస్తి
"త్వం వా అహమస్మి భగవో దేవతే అహం వై త్వమసి"

కన్నులనుండి సూర్యుని, జగన్నుత! చంద్రు మనస్సునుండి, నీ
యున్న వమోమునుండిమఘవాగ్నులఁబ్రాణమునుండివాయువున్
మిన్నును నాభినుండి, చెవిమేరల దిక్కుల, భూమిఁ ద్వత్పదో
త్పన్నము నొనటుల్,జగము భావనమాత్ర సృజించితీశ్వరా! 1

జాతుల పోలికం బడి నిజంబుగ నీవును నట్టి తీరుగా
భూతలి విశ్వరూపతను బొందితి, ప్రాణులభావనంబె చే
యూఁతగ నిల్చి తీవు, గుఱియుం దలఁపోతలు సర్చ్చనావిధుల్
చేఁతలు మాఱె మా, కిది రుచించున నీకు సదాశివప్రభూ! 2

కోరిక సర్వమంగళను గూడితి వోమ్మృడ! నీ వమంగళా
చారివిగాన, పెట్టుబడి సాగకయే రజితాద్రిసద్మముం
జేరితి, బక్కెద్దు తృణజీవి గదాయని వాహనంబుగా
చేరిచి, తాదిభిక్షుకత చేతనొ యేమొ దిగంబరత్వమున్?

నాలో నీవు సదాధ్వనించుచునె యున్నా, వేను సంపూర్తిగా
లో నుంటినొ లేదొ సందియము, నన్నే నీవు చేఁబట్టుచో
జాలిం బెట్టున యీమనోవ్యథలు జంజాటంబులున్ రోగముల్
లీలా యిది? నాదుకర్మమ? జగన్నేతా! శివా! పల్కవే.

---

1 "చక్షో స్సూర్యో అజాయత. ముఖా దింద్ర శ్చాగ్నిశ్చ. ప్రాణా ద్వాయు రజాయత"

2 "అశ్వత్థ స్సర్వవృక్షాణాం మృగాణాంచ మృగేంద్రోహం, పక్షిణాం గరుడః, సర్పాణాం వాసుకిః"

దండిగ నీప్రచోదన విధాననిదానత, నండపిండబ్ర
హ్మాండము నిండి యుండినమహాత్ముఁడ వంచు నెఱింగియున్ మన
స్సుండదు నిశ్చలంబుగ, త్రిశుద్ధిగఁ దాదృశవిభ్రమంబు నీ
నుండియె సంక్రమించె ననియున్ దలఁపోసెద నాదిశంకరా!

దాఁగిలి మ్రుచ్చులాడెద విదా పని? హృత్కమలస్థకోశసం
భాగపుటంతరాంతరవిభాసి మహాగ్నిశిఖాశిఖంబునన్
దాఁగి యణుస్వరూపమున నాయమె త్రిప్పటవెట్ట మమ్ములన్
భోగము నీది నిగ్గనఁగఁబోని యభాగ్యము మాదటో హరా![1]

మౌనము పూని చాటుకృతి మానెను, హస్త మొకండె కావునన్
పూనడ యంజలింప, శిరముం దగ వంపడ యర్థ మౌటఁ, దా
మానము నూని కోపనయనూసతి యుండఁగ, నామె నెట్టుగా
నేని సగంబునై యనునయింపఁగ లేనిగిరీశుఁ డోముతన్.

చిత్రవిచిత్రనామములచే భువిలో సగుణాకృతిన్ మహా
క్షేత్రము లందునిల్చి పదసేవ లొనర్చెడివారికి, న్నిహా
ముత్రఫలప్రదుండ వయి బ్రోచుచు నుంటివి, నీదుసత్కృపా
పాత్రము కానిచో నరుఁ డపాత్రుఁడవాచ్యుఁడు మోక్షదూరుడున్

ఏమనుకొన్న లోన ధ్వనియించును నాకది, నన్ను వీడి యే
భామినిఁ గూడ లే, వెచటు పట్టిన నేనును సిద్ధమేగదా!
ఓమృడ! నీప్రతారణము హెచ్చూద్యమ మెట్టులు సాగునం, చుమా
కోమలి పల్కఁ, భేదిలనికూటమి, నవ్వుపినాకి మ్రొక్కెదన్.

1 పద్మకోశప్రతీకాశగ్ం హృదయఞ్చా ప్యధోముఖం,
తస్యా శ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః''

పరమశివా! యెటిచ్చెదము పాద్యము నర్ఘ్యము లోకమెల్లఁ గ్రి
క్కిరిసిననీకు? ఆసనము నేక్రియఁ గూర్తుము? వస్త్రయుగ్మమున్
బిరుదగుజన్నిదంబును నివేదనమున్ సమకూర్చు టెట్లు? నీ
చిరతరవిశ్వమూర్తికెదొ చేయుటతప్ప, ఉమామహేశ్వరా! 1

అలఁతిగ పొట్టివాడ వయి యాపయి నాకన మంటి వెల్గుచో
బలినియమ మ్మొనర్చినభవత్త్రిపదోద్ధతదివ్యరూపముల్
తలచిరొ, హ్రస్వవామనతలన్ భవదీయబృహత్స్వరూపమున్
దెలిపెనుగాదె యాశ్రుతి పదింబదిగా జగదీశ! మన్నతుల్. 2

ఎందుకు లేదుగాని పరమేశ్వర! నిన్నె భజించుచుండి నీ
యందె మనస్సు నిల్పి నినె ధ్యాన మొనర్చుచు నర్చలిచ్చు నీ
మందుని కావలే వనెడిమాటది నీ కపకీర్తి కాదె? యే
మందును నన్నుబట్టి యవమానము నీకు ఘటిల్లఁ గుందెదన్. 3

---

1 అంత ర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థితః"
"నసందృశే తిష్ఠతి రూపమస్య నచక్షుషా పశ్యతి కశ్చనైనం"
నారాయణోపనిషత్

2 "నమో హ్రస్వాయ చ వామనాయచ, నమో బృహతేచ వర్షీయసేచ"
"త్రిపాదోర్ధ్వ ఉదైత్పురుషః"

3 "విశ్వతశ్చక్షు రుత విశ్వతోముఖో విశ్వతో హస్త ఉత విశ్వతస్పాత్"
'వాజసనేయసంహిత'

"నమో వర్మిణేచ వరూధినేచ నమో బిల్మినేచ కవచినేచ"
"నమ స్తామ్రాయ చారుణాయచ" "అహోరాత్రే పార్శ్వే
నక్షత్రాణి రూపం"

నీరూపుండ వటంచుఁ జాటుచునె,యెన్నేఁ గన్నుల నోర్ములన్
దీరా చేతులఁ గాళ్ల నెల్లెడల వ్యాప్తిం చెందియున్నట్లుగా
నీరూపంబును దెల్పు నా శ్రుతులు వన్నెల్ చిన్నెలం గూర్చి, నీ
తీరుల్ తెన్నులు నిశ్చయాత్మతను భేదించుఁగదా శంకరా!

లక్షమడుంగులౌ జపఫలం బిడు నీరుదురాకమాల, ఫా
లేక్షణ! త్వద్విభూతి యపమృత్యువుఁ దోలు, ననాతురాలుగా
వీక్షణసేయు గ్రామముల విశ్వభవన్నమక ప్రసక్తి, తా
నక్షర శైవసూత్రగణ మయ్యె భవడ్డమరుప్రణాదముల్. 1

మీనయి యబ్ధిసొచ్చి హరి, మేకొని వేనిఁ జిరమ్ము దాల్చెనో
దేనిని నిల్పనై ధరణిదేవులు తన్మహిమల్ వచింతురో
వేనిని నాల్గుమోములను విశ్వసృజుండు సదా ధరించునో
ఆనిగమాలు నీశ్వసిత మౌనొకొ? వాహములా మయస్కరా? 2

నీనుడులందు నిద్దెలుపు నిర్మలమంత్రమొ యర్థవాదమో
పూని వచించి దేవతలె పున్నెము నందిరఁ టట్టివేదముల్
శ్వానములై భవద్గృహకవాటముముంగిలిఁ గాచుచుండ ని
న్నానుడు లాడవే శ్వపతియంచును శంకర! లోకశంకరా! 3

---

1 ''ఉర్వారుక మివ బంధనా న్మృత్యో ర్ముక్షీయ మామృతాత్''
''విశ్వం పుష్టం గ్రామే అస్మి న్ననాతురమ్''
''మనుజాపీతు రుద్రాక్షై రక్షయ్యం ఫల మశ్నుతే"
"ననాద ఢక్కాం నవపంచవారం ఏతద్విమర్శే శివసూత్రజాలం''

2 "యస్య నిశ్శ్వసితం వేదాః'' సర్వనిగమా యస్య వాహాః''

3 ''శ్వభ్య శ్వపతిభ్యశ్చవోనమః''

లేనేలేనిది రేపె యశ్వ మన, మేలే? చూచుకొ మ్మించు సే
నానిం బ్రోవ శివాశ్వసైన్యమును బాండ్యాధీశు కర్పించి వే
దానూనాశ్వము నెక్కి సాదివయి శర్వా! దర్శనం బిచ్చుటన్
సానందంబుగ నిన్ను అశ్వపతివయ్యా, యంచు వేదం బనెన్.1

వేదసుశాఖికాశిఖల వ్రేలుచు సద్ద్విజసేవితంబునై
భేదము లేనిదై సుఖసువృద్ధులఁ గూర్చునదై సుధాఫలా
స్వాదక మైనశంభుపదపావననీడము నాశ్రయింపు ము
న్మాదపుకామచారముల మానుము స్వాంతవిహంగరాజమా!

పరమానందజలాశ్రయంబు మునిహృత్పద్మాకరం బచ్ఛమున్,
పరితస్సద్విజసేవితంబుఁ గలుషప్రధ్వంసి సద్వాసనా
ధరమౌ శంకరచింతనాసరసిఁ దెప్పల్ తేల కానందివై
తిరుగం జెల్లునె ధీమరాళమ! వృథార్తిం జెంద కాసారముల్?

మీరు త్రిమూర్తు లౌటకు సమిద్ధభవత్కృతపూర్వకర్మమే
కారణమందు, రట్టిజడకర్మబలంబునఁ గర్మదేవులై
రీరు, సమిష్టితత్త్వము గ్రహించుటె మోక్షమటంద్రు, మిమ్ములన్
జేరి భజించుమాత్ర ఫలసిద్ధియు నైహికమాత్రమే శివా!

కనులకు ధ్యాన మన్ మెఱుఁగుకాటుక వెట్టి, తమఃప్రదేశమున్
ఘనభవదీయమంత్రబలినామము లన్గునపాలఁ ద్రవ్వి, యో
త్రిణయన! భోగిభూషణము దాల్చిననీపదపద్మ సన్నిధిన్
గను నెవఁడాతఁడే పరమగణ్యుడు మాన్యుడునుం గృతార్థుఁడున్.

---

1 "అశ్వేభ్యో౽శ్వపతిభ్యశ్చ వో నమః"

బసుమనె యంగరాగము కపాలపుమాలయె భూషణంబునన్
బసవడె త్వద్రథమ్ము తగువస్త్ర మనేకపకృత్తి యొక్కటన్
వసతి గలట్టిపూర్ణుఁ డనవద్యధనేశుఁడు మిత్రుఁ డయ్యు ని
పసదన మిట్టిదుర్దశకు బాల్పడె నంచు కలంచు శంకరా!

సంజలు వర్షకాలముగ చాఁగినచేతిహుడుక్క నాదముల్
మంజులగర్జితంబులుగ మానిదృంగచలి చంచలాళిగా
రంజితభక్తబాష్పతతి రాజిలువృష్టిగ నెమ్మి దుర్గగా
సంజలఁ దాండవించు శివసామిని గొల్చెద నీలకంఠునిన్.

ఆగర్భాద్భుతశౌర్యరాశి శివపాండ్యాధీశుసద్గర్భ ము
ద్వేగంబంది తటాతకారమణి నిన్ ద్వేషించి భంగింప నీ
ప్రాగల్భ్యంబున నామె బెండ్లియయి, పూర్ణప్రాభవం బొప్పగాన్
పాగా వేసితి కోటలోపల జగన్నాథా! కులుంచాధిపా! 1

కాళీకాలిమ కంధికాళిమము నీకంఠస్థమా కాళిమం
బాలక్ష్మీపతికాళిమంబు నవి శర్వా! భూష లౌఁగాదె, ఆ
హాలాహరమహోగ్రతాపశిఖి కంఠాగ్రంబుఁ బెల్లేర్చినన్
నీలగ్రీవుఁడ వంచు నీకృతిని వర్ణించెంగదా వేదముల్. 2

ఈపువు నీదుపూజ కనియిచ్చినవానిని కాచినావయా
యాపువె నిన్ను గొట్టుటకునై యిడువానిని కాల్చినావయా
పైపయి వేసముల్ గొనక పట్టుగ లోపలిచిత్తవృత్తికే
చూపుదు నీదుసత్కృప త్రిశూలి! నమశ్శతముల్ దయామయా.

---

1 "ఉష్ణీషిణే గిరిచరాయ కులుంచానాం పతయే నమోనమః"
2 "నమో నీలగ్రీవాయచ శితికంఠాయచ"

ఎవ్వనిభీతిచే శ్వసనుఁ డేర్పడఁ దాను సదాగతుం డగున్
ఎవ్వనిభీతిచే ద్యుమణి యేర్పడఁ దా నుదయించి వెల్గునో
ఎవ్వనిభీతిచే యముడు నేని పరుంగులు వెట్టు భీతిమై
నవ్వరదైవతంబు బ్రమధాధిపు బావములంటి మ్రొక్కెదన్. 1

తేజోమూర్తివి నీవొకండవె, భవద్దేదీప్యమానప్రభల్
రాజిల్లన్ భువి నన్య తేజములు వెల్గుంగాదె బుద్ధిప్రభా
వ్యాజప్రక్రియ నంతరాత్మవయి, వృక్షాకారతన్ స్తబ్ధతన్
పూజల్ కొందు నభంబున న్నిలిచి శంభూ! నీవె యేకాకృతిన్ 2

యోగము యోగ మందురవ యోగము, గొడ్డట మోదుచున్న, ను
ద్వేగము కోపము న్మరణభీతి వణంకును లేని చెట్టునా
సాగెడివాఁడె ని న్గనఁగఁజాలు నటంచు వచించు, మచ్చుకే
నీగతి యేరి కబ్బు? నిను నేరుభజింతురు యోగినాంవరా? 3

---

1 "భీషాస్మా ద్వాతః పవతే భీషోదేతి సూర్యః
"యేన సూర్య స్తపతి. "మృత్యుర్ధావతి పంచమ ఇతి"

2 "వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠ త్యేకః, యేన సూర్య స్తపతి తేజసేద్ధః
యస్య భాసా సర్వమిదం విభాతి. తమేవ భాంత మనుభాతి సర్వమ్"
(తైత్తిరీయబ్రాహ్మణము)

3 "ఛిద్యమానోపి వృక్ష ఇవ తిష్ఠాసే న్నకంపేత నకుప్యేత"

చావవు మమ్ముఁ జంపెదవు, చయ్యనఁ గాలవు కాల్చె దండరిన్
నోవవు నొవ్వఁ గూర్చెదవు, నుగ్గొనరింతువు వాఁడ నెంతయున్,
భావన కందకుండియు శుభాకృతి నుందు, జవంబు లేమియున్. 1
దేవ! మనోజవుండవుగ దే, జగదేకవిధీ! దయానిధీ!

ధ్యానావాహన దేవతార్చలును, సంధ్యావందనప్రక్రియల్
ప్రాణాయామము, లుగ్రమౌ తపము లబ్బా! బాధకే గాని నీ
స్థానం బందఁగ సాధనంబు లగునా? స్వాంతంబు నీయందు సం
ధానింపం దగుపట్టు లేక; జగదాధారా! నమోవాకముల్.

ఈ వాకయాదిభిక్షుకుడవే గద శంకర! బిచ్చగానికిన్
కావలె నొక్క క్రోతి,యది గల్గిన ముష్టి లభించు నెల్లెడన్
తీవగ నాదుభక్తి గణుతించి, మదర్పితహృత్కపీంద్రసు
గ్రీవమునందు దానిని లగించుచుఁ ద్రిప్పుమ యింటికింటికిన్. 3

సంజలె వర్షకాలములు శారికరాహతమర్దలధ్వనుల్
మంజులమేఘగర్జనలు, మాన్యసురేక్షణలే తటిల్లతల్
రంజిలు భక్తబాష్పములె రమ్య సువృష్టి, యపర్ణ బర్హిగా
సంజల తాండవించెడినిపాదు భజించెద నీలకంఠమున్.

---

1 "నజాయతే మ్రియతేవా కదాచిత్''
'నైనం దహతి శస్త్రాణి నైనం దహతి పావకః''
"అనేజదేకం మనసో జవీయః'' బృహదారణ్యకం.
అపాణిపాదో జవనో గ్రహీతా. శ్వేతాశ్వతరం.

2 ''జ్ఞానాదేవతు కైవల్యమ్''
''జ్ఞానవిహీన స్సర్వమతేన ముక్తిం నభజతి జన్మశతేన''

3 ''హృదయకపి మత్యంతచపలం దృఢం భక్త్యా బధ్వా
శివ భవదధీనం కురువిభో''

ఆనందంబున నృత్యమున్ సలిపి శర్వా! నీవు మ్రోయించు ఢ
క్కానాదంబులు సర్వతోముఖములై కైవల్యసూత్రంబులై
నానావ్యాకృతిసూత్రజాలమయి, విన్నాణంబు సిద్ధింప, సి
ద్ధానీకంబును పాణినిప్రభృతు లాయాశాస్త్రముల్ గూర్పరే?[1]

నీవు త్రిశూలి వౌచును, త్రినేత్రుఁడ వౌచుఁ, ద్రివేది వౌచు, సం
భావనమాత్ర బట్టతెలపైఁ బడుబొమ్మలరీతి, జీవలో
కావలి నాడఁజేసెదుగదయ్య, మహానట! నీకి దాఁటయా?
జీవుల కర్మమా? తెలియఁజెప్పుము దుష్టభయంకరా! హరా!

హంతవు శూలి వుగ్రుఁడ వటంచును ఢంకను దెబ్బకొట్టి హా
హంత! వచింప వేదము, రహస్యము నే నెఱుఁగంగలేక, నా
వంత తొలంప, నీదువరివస్యల నుంటి, బిడాలమూషికా
క్రాంతిగ నుండె నీపస, హరా! కరుణింపగదే శివంకరా! 2

మిక్కిలి మెత్తనయ్యవుసుమీ వరభక్తులపట్ల; అమ్మయున్
మిక్కిలి నిమ్నమించి కడుమెత్తన, యిర్వురు నిట్టులున్న నే
ఫక్కిని ముందుముందు గడుపంగలవారలొ? యేకశేషమై
చిక్కరె? మార్దవంబు బలుచిక్కులు త్రిక్కులు తెచ్చిపెట్టదే?

---

1 "నృత్తావసానే నటరాజరాజో ననాద ఢక్కాం నవపంచవారం
ఉద్ధర్తుకామ స్సనకాదిసిద్ధా నేతద్విమర్శే శివసూత్రజాలం"

2 "నమోహంత్రేచ హనీయసేచ" నమఉగ్రాయచభీమాయచ.

ఈవు పితాళ్ళకెల్ల పిత, వీవు సమస్తసురాసురాళికిన్
దేవతవున్, విధాతవుగదే కమలాసనజాతికెల్లనున్,
నీవె నినున్ సృజించికొనె, దీవె నినున్ గనుగొందు, వీశ్వరా !
నీవె ప్రలీనమౌదు పరిశిష్టితతావకతత్త్వమందునన్. 1

వరసంపత్తిని వెండికొండదొరవై భక్షించెదే పుర్రెలో,
పరసిద్ధుల్ కరమందు గల్గియును సర్పాలంకృతుల్ దాల్చెదే,
పరమైశ్వర్యము లీయ దక్షుఁడవు దిగ్వస్త్రుండవే, అయ్యరే
గరలమ్ముం దినుఁ; దన్నపూర్ణసతి నిన్గామించి ప్రేమించినన్. 2

కాముని జంపి తీవు తటకాపడి, పిమ్మట గౌరిఁ గోరి యా
కామునె సంస్మరించితివి, కైటభజిద్వరమోహినీమహా
భూమికయంగసంగమును బొందఁగఁ బర్వులువెట్టి పట్టి నా
వేమని నీదులౌల్యము గణింపఁగ నేర్తుము లోకమోహనా !

కోపము తాపముం, బగరఁ గొట్టుట, తిట్టుట, అక్షి కుక్షియున్
కాపుర, మిల్లు, వాకిలి, నిగారపుసంతును, రాకపోకలున్
సాపడుటల్, మనిద్దరకు సాజములైనవు, డేల మాకు రు
క్తాపము లీయ? పిల్లిచెలగాటమ నీకిదియోన కేశ్వరా ?

---

1 'త్వం పితౄణా మపి పితా దేవానా మపి దేవతా,
సృజ స్యాత్మాన మాత్మనా ఆత్మన్యేవ ప్రలీయసే.

2 ''నసంతి యాథార్థ్యవిదః పినాకినః, నవిశ్వమూర్తే రవధార్యతే వపుః.

హృదయసుమంబు భక్తి నిడ నేలొకో పూవులు నీసమర్చకై
ఎద గదియించి మ్రొక్కు లిడ నేటికొ నీదుసహస్రనామముల్
చదురుగ నిన్నె నమ్మ, నుపచారము లాపదియారు నెందుకో?
సదయ! మహేశ! నీదుపదసన్నిధి గల్గ విచార మెందుకో? 1

గరలము కూడు నీకు, నళికంబున చిచ్చుఱకన్ను నీకు, దు
ర్భరవిషపూత్కృతుల్ నెఱపుపాముఁలు భూషలు నీకు, ఆయుధం
బరయఁ ద్రిశూల, మాకృతి దిగంబర మౌను, పిశాచనాథ తం
దిరిగెదు ప్రేతభూముల మదిన్ దయ కెక్కడిచోటు? ధూర్జటీ!

పంచశరున్ బురంబులను బాపము నాక దహించి, మామకున్
వంచన గూర్చి, జీవహననక్రియ వృత్తిగఁ బూని, దారుకా
సంచరణంబులన్ బరమసాధ్వుల యీలువు గూల్చి తీవు నీ
సంచిత మిట్టు లుండ నను సాకుట నీకు రుచించునా హరా? 2

వప లరుణాక్షితోడుత, క్షపాకర నేత్రముతోడ రాత్రులన్
తవిలి సమస్తలోకసుకృతంబులు, దుష్కృతముల్, గ్రహించుచున్
దివురుట నీదుచూపులకుఁ దెల్లము కానిది లేదు, కాని యీ
భవి యటు లెంచ కెన్నొ యశుభంబులు చాటుగఁ జేయు శంకరా! 3

---

1 "యదీయం హృత్పద్మం యదిభవదధీనం పశుపతే.
("త్వత్సన్నిధి స్సర్వరుజాం ప్రమాపణం.)

2 "రక్కసిమగువల యీలువ మొక్కపటిచి తీవ —" (తిమ్మన)

3 "అగ్ని ర్మూర్ధా చక్షుషీ చంద్రసూర్యౌ" ముండకోపనిషత్.

ఇందునిబద్ధజూటులు మహేశ్వరు లిర్వురు మీరు త్ర్యంబకుల్
సుందరరూపు లత్యఘవిలుంఠనదక్షులునన్ గదయ్య, నా
బంధము లూడ్చి యాపదలు వాపి భవత్పదభక్తి నిచ్చి ని
ష్పందత; నోమరా కునికి భావ్యమె ధర్మమె ఆదిదంపతుల్? 1

జడజనికర్మతోడుత భుజాభుజియందున నీవు తోఁకనున్
ముడిచితివంట, యేమయినవో శివ! నీమటుమాయ లద్భుత
ప్రధిమలు యోగశక్తులు పరాత్పరతల్? నిజమే యిదైనచో
జడిసినయట్టి యొక్క జడజన్మకు నీవు జగద్వశంకరా! 2

కులమతజాతిభేదములకున్ గుటిచేసి మమున్, అభేదతన్
కులుకుదు వీవు, సంతమము గూటిచి మాకు తమఃపరుండవై
మెలఁగెద వీవు, ద్వైత మిడి మేలగు నద్వయ మార్గివైతి, దు
ర్బలపర మిచ్చి నీవొక పరాత్పరుఁడైతి విదేమి శంకరా? 3

పరులకు నందనీక చలపట్టినటుల్ నిగమాగమాదులున్
గురుకొని నిన్ను దాఁచినవి గుట్టుగ, నైనను భక్తకోటి నిన్
జొరఁగ భవద్దయాద్భుతమనోమయమందిర పుంగవాటముల్
తెఱచితివేగదా, మది కదిఁపఁ గుశంక లవేల శంకరా! 4

---

1 "ముక్తావిద్రుమ....... తీక్ష్ణై ర్యుక్తాం"
"ఇందునిబద్ధరత్నమకుటాం"
2 "అవశ్య మనుభోక్తవ్యం కృతంకర్మ" "ప్రారబ్ధం భోగతో నశ్యేత్"
3 "చాతుర్వర్ణ్యం మయా సృష్టం"
"తమసః పరస్తా త్తమేవం విద్వా నమృత ఇహ భవతి"
4 "తన్నిహితం గుహాయాం"
"తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః"

ధ్యేయుఁడ వైనపంచముఖదేవుఁడ వీవు; భవత్కలత్రమా
సాయుధపంక్తిహస్త, పలు కాఁడఁగ బంగర మానునీకు, నా
ప్యాయము మీఱఁ భక్తతతికై యొకకేలుఁ గదల్ప దామె, మీ
మాయ మహావిరుద్ధ మిఁక మార్గము మాకెది సుందరేశ్వరా?

ఎఱుఁగుదునయ్య నే నల మహేశు మహాపురుషున్ తమఃపరున్
అరుణసవర్ణు నంచు శ్రుతియాడుచు నుండఁగ సంశయాత్మతన్
వరలెదు, సంశయాత్ముఁడు వినాశము చెందెడి, నాప్త వాక్యమే
శరణు, శివార్పణంబుగనె సల్పు సమస్తక్రియాకలాపమున్. 1

ఒకఁడే యాత్మగ నుంటివంట తొలి, వేఱొండేది లేదంట యా
యకలంకాత్మత నొంటిగొట్టువయి దేవా నీవు నీబాధ లం
దక మమ్మిందఱ సృష్టిచేసి పలుబాధల్ వెట్టఁగా నేల యిం
తకు మాలోన నిగూఢవృత్తి గనుతత్త్వం బీవె సర్వేశ్వరా. 2

ఇచ్చుచుఁ గర్మయోనుల మహేశ్వర! నీవల దేహవర్గముం
జొచ్చియు నానఖాగ్రముగ జొక్కుచు, బాధలకుం దొలంగుచున్
మచ్చిక లోకనాటక మమానుషరీతిగ నార్తువంట, నీ
సచ్చరితం బెఱుంగక యశాంతిని గుందుదు మేము శంకరా! 2

---

1 "వేదాహమేతం పురుషం మహాన్త మాదిత్యవర్ణం తమసః పరస్తాత్"
''సంశయాత్మా వినశ్యతి"

2 "ఆత్మావా ఇద మేక ఏవాగ్రఆసేత్, నాన్యత్కించన మిషత్''
"ఏకో దేవ స్సర్వభూతేషు గూఢః"

3 ''తత్సృష్ట్వా తదేవానుప్రావిశ దానఖాగ్రేభ్యః'' (తైత్తిరీయం)

జగముల జన్మమొందు ప్రతిజాతికి నుండెను దేవు, డద్ది యే
జగబిగితోడ నుండెనో సృజించికొనెం దమ దేవు నట్లు, మి
న్నగ నరజాతి కిచ్చితివి జ్ఞానము హెచ్చుగ, దానిఁబట్టి యీ
జగడములు న్విభిన్నత లెసంగెను, నీయది విశ్వరూపమే.

పొరిగొని ప్రాణులం దినెడిభూతపిశాచులు నీదు సేవకుల్
పురిగొనుగాలిమేఁపరులు భూషణముల్, తృణజీవి వాహమున్
తరిపెపుఁగూటఁ దావకసతీసుతులన్ దగఁ బెంచుచున్న, ను
ర్వర జగదేకపోషకుఁడవై ప్రథ గాంచవె లోకశంకరా!

వేలకొలందియేడులు తపించి విరించి సృజించె వేనినిన్
బాలనసేయు వేని బహుభంగుల జన్మములెత్తె గౌరియున్
మేలుగ నన్నపూర్ణ యెలమిన్ దగఁ బెంచెనో పెట్టుపోతలన్
హేలగ నాజగంబుల దహింతు త్రుటిన్ లయకాలరుద్రుడా!

గంగమ నీటికిం దడిసి, క్రమఫణీశమణిప్రకాశలన్
రంగుగఁ బల్లవించుచు, గళానిధికాంతుల మొగ్గవట్టియున్,
మంగళసుస్మితంబున సుమస్థితిఁ గాంచి, మహేశఫాలనే
త్రాంగికధూమదోహదము నందు కపర్దలతన్ భజించెదన్.

తిన్నఁడు కాలఁ దన్నె, గురుతింపక కవ్వడి గాండివమ్ముచే
మిన్నగ మోఁదెఁ, బాండ్యుఁ డనిమిత్తము బెత్తమునెత్తి కొట్టె, నీ
వెన్నను రాలతో నదిమివేసె వటుం డొకఁ, డవ్విపూజలై
నిన్నలరింప, మాఁదోసగునే, గణియింతు వదేమి కర్మమో?

ఆనందంబు సుపుత్త్రిపై, గిరిజవక్త్రాబ్జాన లోలత్వమున్
మానాస్త్రింగని కోప, మానతమహాసుత్రాముపై జాలియున్
మానంబుం దనమామపై, విభుత అంబాసత్సఖీపాలిపై
పూనం భాసిలుచంద్రశేఖరుని దృక్పూరంబు నన్నోముతన్.

పూవులతోఁటయే నభము, భూషణపేటి రసాతలమ్ము, నీ
పావనశాటిపాలకులు వాసవముఖ్యులు, నీగుణాలనున్
మోవఁగఁబూనువార్మ్మను, లమోఘసరిత్పతి నీకు తూణ, మో
దేవ! విభూతి నీకు స్మరదేవుఁడెసూ సురసార్వభౌముఁడా!

కావఁ దలంచితేని నను గావుము, కర్మము నడ్డువెట్ట, కీ
జీవి సుదుష్కృతమ్ములను చింతనసేయుట వ్యర్థ మింతకున్
నీవు తలంప ముజ్జగము లే తలక్రిందగుఁ గర్మ మడ్డునే?
హోవయ! యిట్టివంచన విభూ! తగ నాయెడనా జగత్ప్రభూ?

కాముని జంపి వక్రపథగామిని వేఱొక కామినిం గొనన్
నీమది సిగ్గు లేదె? యుధినేతవుగా, కుటిలస్వభావయే
భామిని నింకొకర్తెఁ దలపై నిడుకొంటివి ధూర్తవృత్తి నే
నేమని యందు నంచు నుమ యెన్నఁగ నవ్వెడి శంభుఁడోముతన్.

ఆనందస్ఫుటితంబు లౌచును సమాధ్యంతంబులన్, గౌరివ
క్త్రానం బూర్ణవిలాసభాసురములై, కందర్పునిం గాల్చుచో
భానూద్యద్ద్యుతులై, తదీయసతితాపానన్ దయార్ద్రంబు లౌ
నానారూపభవద్దృగంచలము లానందాబ్ధి నన్ దేల్చుతన్.

దేనన్ బుద్బుదఫేనఖండములరీతిన్ తేలు బ్రహ్మాండముల్
దేఁన్ బ్రహ్మముఖామరుల్ జలకణశ్రీరూపులై నిల్తురో
దేనం దోఁచెడి చిత్స్వరూప స్ఫురిరీతిన్ దన్మహాశక్తి, యా
స్వానందామృతనిర్భరేశ్వరమహాపాథోధి న న్నోమితన్.

కలవు హిరణ్యబాహువులు కన్నులు కాళు లటంచు వేదముల్
పలుకును, లోకమందున భవద్వరమూర్తుల నెందుఁ గాంచినన్
చెలఁగును లింగరూపముగ, నిన్నిఁక భావన నిల్ప నెట్లగున్ ?
గులుకఁగ భార్యయున్ సుతులునున్ గలరంట, అదెంతసత్యమో1

పలువురు చూడ నంజలినిబద్ధత సంధ్యను గోరుచుంటివే,
తలపయి సిగ్గుమాలి యొకతన్విని దాల్చితి, వబ్ధి త్రచ్చుచోఁ
గలిగినలక్ష్మిఁ బొందక ప్రగాఢవిషమ్ము గ్రహించి తేల? నం
చులుకఁగ గౌరిపల్కఁ బుయిలోడుశివుండుననున్ గణించుతన్.

భూతపిశాచనాథతను, భూషితభీషణసర్పభూషతన్
ఘాతుకవహ్నినేత్రత, దిగంబరతన్, భయమూర్తి వయ్యు నీ
వాతతభూతజాతి కభయం బిడువాఁడవు లోకశంకరా!
ప్రేతతలస్థితుండ వపవిత్రుఁడ వయ్యుఁ ద్రిశుద్ధి గూర్తువే.

బేలల మయ్యు, పాండ్యవిభుబెత్తపుదెబ్బలబాధ నందఁగా
జాలుదుమయ్య? యిప్పుడు నిజంబు వచింపక దాఁచిపెట్టుచోఁ
దేలుదుమే? శిలాహతులఁ దిన్ననితన్నుల ఫల్గునప్రహా
రాలను బాలువెట్టిన? హరా కరుణింపఁగ దే పరాత్పరా!

---

1 "నమో హిరణ్యబాహవే- "సహస్రాక్ష స్సహస్రపాత్"

శ్వేతార్కంబులా బిల్వకాంచనములో శీర్షంబునం బెట్టి యే
భూతం బిద్ది "శివార్పణం బనునో" సంపూర్ణానుకంపుండవై
ప్రీతిన్ వానికి నీస్వరూప మిడెదో భీమా! తపోయజ్ఞపూ
జాతంత్రంబు లవేల నిన్గన జగత్సాక్షీ! నమోవాకముల్.

అయ్యకు నైదుమోములు సహస్రముఖంబులు నాగరాజు, కా
రయ్యెను చిన్నవానికి, గజాస్యుఁడు జ్యేష్ఠసుతుండు, భైక్ష్యమే
యయ్యెను నిత్యజీవిక, వృషాధిపుఁ డెక్కటివృద్ధు, తోడులా
దయ్యము లంచు బార్వతి వ్యథంపడ నవ్వెడి శంభుఁ డోముతన్.

బుద్ధిబలం బహంకృతి యపూర్వపువాదము, వీనితో, నసం
బద్ధవినిర్ణయంబుల భవద్గుణనామము లెట్లుచెప్పినన్
బుద్ధము నిర్గుణంబు పరిపూర్ణ మనాద్య మనంతమైననీ
యిద్ధమహస్సునం దిముడవే యవియెల్ల నుమామహేశ్వరా! [1]

శూలివిగాన సైంధవము చొక్కుచు మెక్కితి, వగ్నినేత్రకీ
లాలతపస్సు శాంతిలఁ దలన్ వెలయించితి గంగధార, నా
కాలుని వెక్కిరింప సుధకై దరిచేర్చితి సోము, వృద్ధకా
పాలికుఁ డౌటచేగద, యపర్ణను బొందితి వోసదాశివా! [2]

---

1 "యం శైవా స్సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాంతినః"

2 తపస్సు = వేఁడిమి.

అంతకుఁ గాలుఁ దన్నితి, వహస్కరు నొక్కఁ చపేటికాహతిన్
దంతము లూడఁగొట్టితి. పితామహు పంచమశీర్ష మూడ్చి, తే
మంతపరాధముల్ సలిపి? రాయఘు మూరకె పోవునయ్యా? నీ
వెంతయుధీశ్వరుండవయితేని, యివేటిపనుల్? మహేశ్వరా!

లీలగ క్ష్వేల మీవు కబళింపవయేని జగన్నివాస, దే
వాళియు సప్తతంతువుల హవ్యము లెట్లు భుజింపనేర్చు నో
శూలి! సమస్తభూతములుఁ జొక్కఁగ, నీవు శ్మశానవాసివై
పాలన సేయకుండిన, సుపర్వులు మేడల హాయి నుందురే?

బసుమపుపూత రంజిలఁగ, ఫాలతలంబున కన్ను దివ్వెగా
కుసుమస్రజంబుగాఁగ మెడకుం గలపన్నగరాజు, గంగనీ
రెసగఁగ, రాగిరంగుజడలే, మృదుపల్లవపాళిగా, జగ
ల్లసదురుమంటపంబున సదాశివ! నీవొక పూర్ణకుంభమే.

క్రొన్నెలవెన్నెలల్ మధురకోమలకోరకపంక్తిగా, జటల్
ప్రసన్నిపల్లవంబులుగ, పన్నగశీర్షమణుల్ సుమాలుగా
అన్నువశాఖలై తనర హస్తము, లాగిరిజాముఖేందుసం
పన్నసుధాప్రవర్ధిత, మమర్త్యమహీరుహ మీశు నెంచెదన్.

నందియు భృంగి తండువు ననంతభవద్గణముల్ నటింప, నా
నందదతాండవంబును బొనర్చెడివేళ, భవచ్ఛరీరముం
బొంది ధరిత్రిజారినవిభూతి సమస్తసురాగ్ర్యమాళులన్
బొందుమహాప్రసాదమటపో, పరిమర్దితదుర్మనోభవా!

మౌలిఁ దమాలమాలగ నుమాముఖపంకజమందు భృంగిగా
స్థూలకుచాలపై నగురుశోభగ దృష్టులఁ గజ్జలంబుగా
ఫాలమునందుఁ గస్తురిగ, భవ్యశ్రుతిన్ వికచోత్పలంబుగా
గ్రాలుకపాలమాలిశితికంఠరుచుల్ నను బ్రోచుఁగావుతన్.

నానారూప! మదాయురశ్వపితృసంతానాదులం దెప్పుడున్
"మా నో రీరిష రుద్ర" అంచు నిను, మాన్యత్వన్మహామన్యువున్
ధ్యానింతున్ నిరతంబు కాని భవదీయం బైనవాత్సల్యరే
ఖానాస్తిత్వమె తోఁచు, నిన్ననుట ఉగ్రా! నాదుదౌర్బల్యమే. 1

విశ్వము నుద్ధరింపఁ బ్రభవించి త్రిమూర్తులయంశలన్ సదా
శాశ్వతమౌ చతుశ్శ్రుతుల శ్వానముల ట్లొనరించినావు నీ
విశ్వజనీనముల్ త్రయికి వేడుక చేసినకారణాన, "శ్వ
భ్యశ్శ్వపతిభ్య వో నమ" యటంచు నుతించెను గా నటేశ్వరా!

నెమ్మది నీదుపాదములనే శరణమ్మని చిత్తశుద్ధిగా
నమ్మితి, త్వత్సపర్యల ననారతముం బొనరించుచుంటి, ని
త్యమ్మివి నాకు రక్షయిడునా యనిపించెడి "అస్తినాస్తి" ది
ష్టమ్మతి, నిచ్చి కాల్చెదవు సామి యిదేమి దయాదరిద్రతో?

అప్రతిపద్యమానములయౌ విధిచోదితకర్మపద్ధతుల్
క్షిప్రము నిన్నుఁ గూర్పఁగల చేవయు లేనివి, భక్తి మార్గమా
అప్రహతమ్ము మా; కయిన నాపథమే గయికొంటి శంకరా
విప్రతిషేధ గల్గుసరవిన్ పరకార్య మొనర్చుటే గదా?

1 "మానో మహాంతముతమానో అర్భకం, మానోవధీః పితరం మోతమాతరం
మాన స్తోకే - మానఆయుషి - మానో అశ్వేషు రీరిషః.

అక్కట!"మన్మనా భవ, వహామి భవత్కుశలం" బటన్న నీ
టక్కరిమాట నమ్మ్మట విడంబిత మయ్యెను నాకు, నర్చనల్
మ్రొక్కులుధ్యానమున్నతు లపూర్వసపర్యలు సల్పుచున్నను
న్దిక్కఱియుంటి నెన్నటికొ దివ్యభవత్కృప చంద్రశేఖరా? 1

పరమేశ! నన్ను గాపాడఁగాఁ దలతేని
యవతారమెత్తి తారాడవలెనె?
అవతరింపఁగఁ దప్ప దయ్యెనే నద్దియు
తెలియనివిద్యయే దేవ నీకు?
సాకంగ నన్ను భుజాభుజియుండు నీ
వఱిఁ దెగటార్చుతెం పమరవలెనె?
పాశుపతాద్యస్త్రపటిమ కావలయునే?
యోమదే నీదునిట్టూర్పొకండె?
దృఢతరంబైన భక్తి నాదే యటన్న
భక్తరక్షణ నీపాలఁ బడకయున్నె?
విసివి యీాపని నీవు గావింపవేని
గెలుపు నాదురితములదే గిరిశ! నిజము.

అంతర్హితమ్ముగా నమరించికొన్నట్టి
మహితబ్రహ్మకపాలమాలతోడ
అవతంసమాణిక్యమై వెల్గుచంద్రక
లాబద్ధపృథుకపర్దమ్ముతోడ

1 "మన్మనాభవ...మద్యాజీ - యోగక్షేమంవహామ్యహమ్" గీత

క్షీరాబ్ధితరగవాసిని మించి డాకాల
శేషాహికటకపుంజెలువుతోడ
సర్వోపనిషదర్థసారధ్వనులు నింపు
కమ్రమథక్కాంకిత కరముతోడ

భసితసర్వాంగరాగసంవాసితముగ
అలికనేత్రమన్ కస్తురితిలక మొప్ప
హారకంకణసర్పవిహారి వైన
ఓనటేశ ! సర్వేశ ! నన్నేమరావె?

అలకొప్పులోని వెన్నెలఱేఁడు దీపించి
కొంగ్రొత్తచలువలు గ్రుమ్మరింప
మంచుఁగరళ్ల నుబ్బించి క్రొమ్ముడిలోని
మినువాక చలువలు చినుకుచుండ

పలుకఁబాఱుచుఁ బాటపాటని తెలినవ్వు
తులకించి చలువలు చిలుకరింప
కరపదాననసనేత్రకమలాకరం బనఁ
దెలిమేను చలువల నొలుకఁబోయ

అంబికాశీతలకటాక్ష మావహిల్లి
నెటి దయామృతవర్షివై నీయెడంద
ఇన్నిచలువలు కలదివై యున్నఁగాని
యిపుడు నను జల్లఁగాఁ గాంచదేమి సాఁబ?

సర్పభూషల విషసంక్రాంతి కడలడు
చంద్రామృతమున కుత్సవము గొనఁడు
అఱుతఁ బుఱ్ఱెలమాల కాశాచ మనుకోడు
గంగాంబువుల శుచిక్రమము గొనఁడు
చితిభస్మ కుద్విగ్నచిత్తుఁడు కాఁబోఁడు
గిరిజాంగరాగాన మురిసిపోఁడు
గరలపుఁగూటి కుత్కంపంబు నందఁడు
కాఁటికాపురమునఁ గలఁతపడఁడు

తనదిగంబరత్వమున కుత్తలము గొనఁడు
తనదు ఘోరాతిఘోరత్వమునకుఁ దలఁడు
ఆతఁ డెప్పు డాత్మారాముఁడై హితాహి
తములఁ సముఁడు స్వస్థుఁడునౌచు విమలుడయ్యె.

ఆకొన్న మెడనాగు వాగణపతివాహ
నంబైన యెలుకకై డంబునెఱప
కొమరువాహన మైనవమలి యానాగువున్
బొడవడంపఁగఁ బొంచిపొంచి యుండ
అంబవాహనసింహ మలగజాననుబట్టి
కుంభభేద మొనర్చి కూల్ప నుండ
ఉత్తమాంగం బెక్కియున్న గంగను గాంచి
గిరిజ యసూయతో గింజుకొనఁగ

అగ్గికన్ను చందురుఁ బట్టి యార్పనుండ
ఈకుటుంబంపుఁగలత వీక్షింపలేక
సగమె తనమగతన మని పొగిలిపొగిలి
త్ర్యంబకా! కాలకూటము మ్రింగినావె?

ఎదురుగా నిలుచుండి యెఱుఁగెద నంటినా
అగ్రేవధుఁడ వంచు నాడెను శ్రుతి
దవ్వుగ నిలుచుండి దండంబు లంటినా
దూరేవధుడవంచుఁ దూఱెను శ్రుతి
నాలోన నేనె మన్నతులంచుఁ దలఁతునా
నిను జఘన్యుఁడ వంచు వినిచెను శ్రుతి
నిను మ్రొక్క నాకేమిపని యంచు నుంటినా
నిను నభిఘ్నునిగను పనవెను శ్రుతి

ఓమయోభవ! నన్నెట్టు లోము దీవు?
ఓమయస్కర! నాకు దిక్కున్నదయ్యా?
తార! తామ్రా! రుణా! రుద్ర! దయనుగనవ
శంగ! సోమ! నాబాధ కాసంత కనవ? 1

పరమేశ! గోవిందపరమేష్ఠిగోష్ఠుల,
మరగుచు నామాట మరచినావొ?
ప్రాలేయగిరిసుతాభావవిలాసముల్,
మరగుచు నామాట మఱచినావొ?

1 "నమోఽగ్రే వధాయచ దూరేవధాయచ నమోజఘన్యాయచ"

నావంటియార్తుల నేవంక నేఁ గావఁ,
దిరుగుచు నామాట మఱచినావొ ?
పరిహరింపఁగరాని బంధుకార్య మొనర్ప,
మది నెంచి నామాట మఱచినావొ ?

పాప, కర్మ, మాయాత్రయబంధకలన,
విసివి వేసారుచను విడిపింతు వనుచు
భక్తి సేవింప, నాల్గవబంధ మిపుడు,
నెత్తి కెత్తితి వొకరుజ నీలకంఠ !

నొసలిమూఁడవకన్ను దెసమొల నీవికా
రాకారరేఖల నాడుచుండ
పచ్చియేనికతోలుఁ బాపసొమ్ములు నిన్ను
నేబరాసి వటంచు నెంచి పలుక
బూదిబుస్సన్నవై చేఁదుమేఁపరివొల
నీయకించనత వర్ణించి తెలుప
గట్టుపట్టులు కాఁటికాపురంబులు నీదు
నెడ్డితనంబెల్ల నెఱుకపఱుప
వసతి, తిండి, రూపవైఖరి, వృత్తి, నీ
వేషభాషలెల్ల వికృతము లగు
వికృతరూపియందు వెలయునా గుణములు?
గుణివె యైన నన్ను గూర్మిఁ గనవె ? 1

1 "యత్రాకృతి స్తత్ర గుణాః"

మగతన మందుమా సగమె యైనకతాన
బ్రహ్మాండముల నేలుప్రాప్తి లేదు
ఆడుతనం బన్న నదియు సగంబాట
గృహయోగ్యకృత్యనిర్వహణ లేదు
సకలలోకోద్విగ్నసైన్యాధిపతి వాట
నంగబలం బిసుమంత లేదు
ఒకమూర్తిలోన రెం డుండుట నీకెప్డు
వచనలింగాది నిర్వచన లేదు

మున్ను పార్థప్రహారముల్ పొంది తనఁగ
ఆదరింతుము మృగయావినోదముగను
లాభమే లేనియీయపార్థప్రహార
ములను బొందుట యిది యెట్టిమొఱకుఁదనమొ ?

భూతేశ ! నీకేమి పోఁగాల మదివచ్చెఁ
గడల నీయిలు వల్లకాఁడుగాను
అగశయ ! నీకేమి యంత్యకాలము వచ్చె
జన్మనీయది ముష్టిజన్మగాను
ఈశ ! నీకేమి వినాశకాలము వచ్చె
నీదుమిక్కిలికన్ను నిప్పుగాను
శితికంఠ ! నీకేమిచిత్తవిభ్రమ మబ్బె
బ్రదుకు నీయది దిగంబరముగాను

పశుపతీ! నీదు పాపంబు పండిపోను
పాడవు నీయొడలెల్లను బుగ్గిగాను
స్మరహరా! నీకు మరణము సంభవిలదె
గరలమున నీదుకుత్తుక కమలిపోను.

కకపాలి! నీకిట్టికలుషంపు చేష్టలా
పాయలై నీయొడల్ బ్రద్దగాను
స్థాణువా! నీకేమి దాపురించినదిరా
వికటసంతానివై వేఁగిపోను
గిరిశయ! నీవెట్టికఱకుమానిసివిరా
పాపభూషలు నిన్ను పట్టుకోను
ధూర్జటి! నీవెంతధూర్తనటుడవురా
తలయేఱు నీకెప్డు నిలిచిపోను

అష్టపాపాలభైరవు డైతివిగద
ఓరి నీనెత్తి మూడివడి నీరు గార
ఈశ! నీవెప్డు శూలివై యెసఁగుచుండ
నన్ను బ్రోవఁగఁ దెలిపి నీ కెన్న డబ్బు?

ముగ్ధశశాంకమౌళి! కడుమూఢుఁడనై యెద సంచలింప సం
దిగ్ధప్రలాపముల్ పలికితిన్ కువితర్కముతో, పరేశ! యీ
ముగ్ధుని కెట్టియర్హతలుపో నిను దెల్పగ దేవ! నీదువై
దగ్ధిని జూపి కాచినను మానిన సర్వము నీదెకాదొకో?

నిధనపతీ! నతి నిధనపతాంతకా!
ఊర్ధ్వా! నమస్కృతు లూర్ధ్వలింగ!
ఓహిరణ్యా! మ్రొక్కు, లోహిరణ్మయలింగ!
స్వర్ణా! మొఱంగుడుల్ స్వర్ణలింగ
దివ్యా! జోహారులు, దివ్యలింగా! జోత
భవ! భవలింగ నావందనములు
శర్వ! చేమోడ్పులు శర్వలింగా! నతుల్
శివ! శివలింగ! నాచిన్నిపూలు
జ్వలరూప! గాడ్పులు, జ్వలలింగ! దండము
లాత్మ! చేవిప్ప లోయాత్మలింగ
పరమ! వెన్నెలలయ్య, పరమలింగా! మ్రొక్కు
విభు! టెంకణాలు, గొబ్బిళ్లు దేవ!

కలవికరణ! సద్యోజాత! బలవికరణ!
బల! బలప్రమథన! భవోద్భవ! నమోస్తు
జ్యేష్ఠ! రుద్ర! మనోన్మన! శ్రేష్ఠ! కాల!
సర్వభూతదమన! నమశ్శతము లివియె.

చిత్తము చివరిగడల నిన్
హత్తుకొనుచు నీదుస్మరణ మైన నొనర్పన్
సత్తువ నందఁగ నే ని
న్నిత్తెఱఁగున నభ్యసించి తీభావనలన్.

కాలము వృథపుచ్చక మిడి
మేలపుటూహాల మనస్సు మేకొనకుండన్
నీలీల లంటి, కంఠే
కాలా! నావ్యథల దొలఁచి కాపాడగదే!

శివ యను రెండక్షరములె
యవకరము లణంపఁ గావ్యమంతయు నాశాం
భవమే యైయుండఁగ నా
భవపాపము లణఁగకున్నె పరశివుకరుణన్?

శ్రుతిహితమ్ములు ప్రాక్షవిమతిహితములు
మామకీనము లగుభావమణులు శర్వ!
విన్నపంబులు వక్రోక్తు లెన్నికైన
వ్యాజనిందలు నుతులుగా వ్రాసి యిడితి.